
# బీఆర్‌ఎస్ వెంటే మేమంతా..


దుర్గామాతవద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్, స్థానిక నాయకులు

- ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన యువకులు
- అందోల్ మెజార్టీ గత రికార్డులను తిరగరాయాలి..
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పిలుపు
- దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు
- ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

అందోల్, ఆక్టోబర్ 22: రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ఎంతో అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ వెంటే తామంతా ఉంటామని మండలంలోని అక్సాన్‌పల్లి గ్రామానికి చెందిన యువకులు ఆదివారం ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీల నుంచి పెద్ద ఎత్తున పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. పాత..కొత్త అనే తారతమ్యం లేకుండా పార్టీ శ్రేణులందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని జిమిక్కులు చేసినా వారికి డిపాజిట్లు కూడా రావన్నారు. గతంలో కంటే రెట్టింపు మెజార్టీని అందించి రికార్డులను తిరగరాయాలని పిలుపునిచ్చారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా జోగిపేటలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నియోజకవర్గం ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత అలయ్.. బలయ్ కార్యక్రమం కోసం జోగిపేట ఎన్టీఆర్ స్టేడియంలో స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య ఉన్నారు. అలయ్.. బలయ్ కార్యక్రమానికి నియోజవర్గంలోని 9 మండలాల నుంచి పెద్ద ఎత్తున్న ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ఇతర వీఐపీలు రానున్నారు. ఈ మేరకు స్థలాన్ని పరిశీలించి తగు ఏర్పాట్లు చేయాలని పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే ఆదేశించారు. జోగిపేటకు చెందిన హన్మంత్ రావుపేట్ శంకర్ గౌడ్ ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, కౌన్సిలర్లు చందర్ నాయక్, నాగరాజు, అక్సాన్‌పల్లి సర్పంచులు నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హరినారాయణవర్మ, మాజీ ఎంపీటీసీ శివశేఖర్, సునీల్‌కుమార్, వెంకటేశం, లక్ష్మణ్, సాయి కుమార్, అర్ఫత్ తదితరులు పాల్గొన్నారు.


అలాయి బలాయి నిర్వహణ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, పార్టీ నాయకులు

# పోలీసుల ముమ్మర తనిఖీలు

## తనిఖీల్లో పట్టుబడిన రూ.70వేల నగదు


రామాయంపేట పలు ప్రధాన రహదారుల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

రామాయంపేట, అక్టోబర్ 22 : రామాయంపేటలో 44వ జాతీయ రహదారిపై దామరచెర్వు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వాహనాల తనిఖీలో భాగంగా ఓ కారులో రూ.70 వేలు లభ్యమైనట్లు రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, ఎస్సై రంజిత్ తెలిపారు. ఆదివారం వాహనాల తనిఖీని చేపట్టామన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున దామరచెరువు వద్ద నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో చెందిన ఓ వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.70వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమ డబ్బులకు సరైన పత్రాలతో తీసుకువెళ్లాలని పోలీసులు సూచించారు.

### చెక్ పోస్టుల తనిఖీ

మెదక్ అర్బన్, అక్టోబర్ 22 : అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను చేపడుతున్నామని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అన్నారు. ఆదివారం హవేళీఘనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోచమ్మరాల్ చెక్‌పోస్టు, రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరచెరువు చెక్ పోస్టులను ఆక్మసికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఎవరైనా ఎలాంటి ఆధారాలు లేని నగదు కానీ మద్యం, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించాలని పేర్కొన్నారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి పలు సూచలను చేశారు.


పోచమ్మరాల్ చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్

# పటాన్‌చెరు బీజేపీలో భగ్గుమన్న అసంతృప్తి జ్వాలలు

- నందీశ్వర్‌కు టికెట్ కేటాయింపుతో స్థానిక నేతల ఆగ్రహం
- బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసిన శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు బీజేపీలో ముసలం పుట్టింది. పటాన్‌చెరు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నందీశ్వర్‌గౌడ్‌ను ప్రకటించటమే ఇందుకు ప్రధాన కారణం. బీజేపీ అధిష్టానం ఆదివారం తొలిజాబితాను ప్రకటించింది. సంగారెడ్డి జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలకు ఒక్క పటాన్‌చెరు టికెట్‌ను మాత్రమే నందీశ్వర్‌కు ప్రకటించింది. నందీశ్వర్‌గౌడ్‌కు బీజేపీ అధిష్టానం టికెట్ కేటాయించడంతో ఆ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. బీజేపీ అధిష్టానం నిర్ణయంపై సొంత పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ టికెట్ ఆశించిన శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, డివిజన్ స్థాయి నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి అధిష్టానం నిర్ణయాన్ని తప్పుబట్టారు. గెలుపు గుర్రాలకు టికెట్ ఇవ్వాల్సిన అధిష్టానం, నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ ఇవ్వడంపై బీజేపీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం వెంటనే తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చి గెలిచే నాయకుడికి టికెట్ ఇవ్వాలని బీజేపీ నాయకులు అధిష్టానం పెద్దలను కోరారు. మీడియా సమావేశం అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్‌గౌడ్ సహా ఇతర నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసినట్లు సమాచారం. పటాన్‌చెరులో అభ్యర్థిని మార్చాలని కిషన్‌రెడ్డి వద్ద పటాన్‌చెరు నాయకులు పట్టుబట్టినట్లు తెలిసింది.

### బీజేపీలో చిచ్చురేపిన అభ్యర్థి ప్రకటన

పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నందీశ్వర్‌గౌడ్ పేరును ప్రకటించడమే పటాన్‌చెరు బీజేపీలో చిచ్చుకు కారణమైంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ కోసం నందీశ్వర్‌గౌడ్‌తో పాటు రాష్ట్ర నాయకులు అంజిరెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ పోటీపడ్డారు. శ్రీకాంత్‌గౌడ్, అంజిరెడ్డి ఎవరికి వారే తమకు టికెట్ వస్తుందని ఆశించారు. నందీశ్వర్‌గౌడ్‌కు ఎంపీ టికెట్ ఇచ్చి తమకు ఎమ్మెల్యే టికెట్‌ను అధిష్టానం కేటాయిస్తుందని శ్రీకాంత్‌గౌడ్, అంజిరెడ్డి ఆశించినట్లు తెలిసింది. అయితే అధిష్టానం అందుకు భిన్నంగా నందీశ్వర్‌గౌడ్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదివారం ప్రకటించింది. నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ కేటాయించటాన్ని శ్రీకాంత్‌గౌడ్, అంజిరెడ్డి వర్గానికి చెందిన నేతలు జీర్ణించుకోవడం లేదు. నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ కేటాయించడంతో ద్వితీయ శ్రేణి నాయకుల్లో సైతం అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ కేటాయించడంపై శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు దేవేందర్‌గౌడ్, జిల్లా నాయకులు కుమార్, మధుకర్‌రెడ్డి, కావాలి వీరేశం, నాగరాజుయాదవ్, నర్సింహాగౌడ్, మన్నె శ్రీకాంత్, కోటి శంకర్, బండి శ్రీకాంత్‌గౌడ్, చింతల యాదగిరి తదితరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బీజేపీ అసంతృప్తి నేతలు అధిష్టానం నిర్ణయంపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదవుల కోసం పార్టీలు మారే నందీశ్వర్‌గౌడ్ టికెట్ ఎలా కేటాయిస్తారని అసంతృప్తి నేతలు ప్రశ్నిస్తున్నారు. నందీశ్వర్‌గౌడ్‌కు పార్టీలోని మెజార్టీ నేతలతో సత్సంబంధాలు లేవని, ప్రజల్లో తిరగడని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండరని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా నందీశ్వర్‌గౌడ్‌పై విపరీతమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయని, అలాంటి నేతకు టికెట్ ఇవ్వడం పార్టీకి నష్టం చేకూరుస్తుందన్న అభిప్రాయాన్ని బీజేపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ వెంటనే అభ్యర్థిని మార్చాలని, లేదంటే పార్టీ వీడుతామని పలువురు నేతలు చెబుతుండడం బీజేపీలో అంతర్గత విభేదాలకు అద్దం పడుతున్నది. నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నేత బండి సంజయ్ అధిష్టానంపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది.


ఇస్నాపూర్‌లో మాట్లాడుతున్న గడీల శ్రీకాంత్‌గౌడ్

### కిషన్‌రెడ్డిని కలిసిన శ్రీకాంత్‌గౌడ్...

పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ ఆశించిన బీజేపీ పటాన్‌చెరు నేత శ్రీకాంత్‌గౌడ్ నియోజకవర్గ నాయకులతో కలిసి ఆదివారం రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డిని కలిసిన శ్రీకాంత్‌గౌడ్ పటాన్‌చెరులో ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని పట్టుబట్టినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని మెజార్టీ నాయకులు నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ ఇవ్వడంపై అసంతృప్తితో ఉన్నారని, అధిష్టానం ఈ విషయాన్ని గుర్తించి వెంటనే అభ్యర్థిని మార్చాలని, ప్రజల్లో బలం ఉన్న నేతకు టికెట్ ఇవ్వాలని కోరినట్లు సమాచారం.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పటాన్‌చెరు అభ్యర్థి మార్పు అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అభ్యర్థి మార్పు అంశంపై ఒత్తిడి తీసుకువచ్చేందకు శ్రీకాంత్‌గౌడ్ ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టికెట్ దక్కని అంజిరెడ్డి సైతం అభ్యర్థి మార్పు విషయమై అధిష్టానం పెద్దలను కలవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

### అధిష్టానం పునరాలోచించుకోవాలి

పటాన్‌చెరు, అక్టోబర్ 22 : బీజేపీ పటాన్‌చెరు టికెట్‌పై పార్టీ అధిష్టానం పునరాలోచించుకోవాలని మాజీ జడ్పీటీసీ, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్, బీజేపీ నాయకులు, 8 మంది మండల, మున్సిపల్, డివిజన్ అధ్యక్షులు డిమాండ్ చేశారు. ఆదివారం వెలువడిన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థుల లిస్టులో మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ పేరుండడంతో బీజేపీ శ్రేణులతో కలిసి ఇస్నాపూర్ చౌరస్తాలో గడీల శ్రీకాంత్‌గౌడ్, పార్టీ శ్రేణులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి ప్రకటనపై తా ము అసంతృప్తితో ఉన్నామన్నారు. పూటకో పార్టీ మారుతూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం చేసే నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ ఇవ్వడం సరైంది కాదన్నారు. సర్వేలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత అభ్యర్థుల ప్రకటన చేయాలని, తామంతా కోరితే సర్వేలు చేయకుండా నిర్ణయం తీసుకున్నారని తప్పుపట్టారు. పార్టీ పెద్దలు టికెట్ విషయంలో తనకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి బైండ్లకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధుకర్‌రెడ్డి, పటాన్‌చెరు మండల అధ్యక్షుడు కావలి వీరేశం , పటాన్‌చెరు 113 డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాద వ్, రామచంద్రాపురం 112 డివిజన్ అధ్యక్షులు నర్సింగ్‌గౌడ్, భారతీనగర్ 111 డివిజన్ అధ్యక్షుడు మన్నె శ్రీకాంత్, నేతలు పాల్గొన్నారు.